నాడు నిలబడి.. నేడు తడబడి

- నిర్లక్ష్యం నీడన విద్యా సంవత్సరం
- ఒక్క రూపాయి సాయమందించని కూటమి ప్రభుత్వం
- కలిసొచ్చిన గత ప్రభుత్వ కృషి
- విద్యార్థుల శ్రమతో మెరుగైన ఫలితాలు



ఆలమూరు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. 2024–25 విద్యా సంవత్సరం దాదాపు పూర్తయ్యింది. కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు సైతం వెల్లడించారు. విద్యా సవత్సరం దాదాపు అంతా కూటమి ప్రభుత్వ హయాంలోనే కొనసాగింది. విద్యా సంవత్సరం ముందు ఎన్నికల సమయంలో కూటమి నేతలు తమ ప్రభుత్వం వస్తే ఒక్కో విద్యార్థికి రూ. 20 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల కృషితో పరీక్షల్లో గట్టెక్కారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పాఠశాలల మెరుగుదల, విద్యా సంవత్సరం సమర్థవంతమైన నిర్వహణ అనుభవాలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడ్డాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 2024 వార్షిక పరీక్షలు సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడిని తొలగించేందుకు ఆత్మవిశ్వాసం పెంచి, పూర్తి స్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు 'జయీభవ సంకల్ప' కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పేరును 'సంకల్ప్ 2025'గా మార్చి ప్రచారం చేసుకొంది. 2024 ఫిబ్రవరి 29 నుంచి 50 రోజులు పాటు ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, స్కూల్ ప్లస్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయల్లో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించింది. నాడు–నేడు పేరుతో పాఠశాలలను డిజిటల్ విద్యా పరికరాలను అమర్చింది. పాఠ్య పుస్తకాల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో పాఠ్యాంశాలున్న పుస్తకాలను అందించింది. ఇలా విద్యా సంవత్సరం తొలి నుంచి పరీక్షలు నిర్వహించే వరకూ బాధ్యతగా వ్యవహరించింది.

రెండు 406 ప్రభుత్వ పాఠశాలలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 310 ప్రాథమిక, 31 ప్రాథమికోన్నత, 64 ఉన్నత మొత్తం 406 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటికితోడు ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులున్నారు. గత ప్రభుత్వ హయాంలో బడులు తెరిచే నాటికి రూ.15 వేలు సాయాన్ని అందజేశారు.

ఏడాది గడిచినా సాయం అందలేదు



ఎన్నికల సమయంలో ఇచ్చిన తల్లికి వందనం హామీ అమలుకు నోచుకోలేదు. విద్యా సంవత్సరం పూర్తయ్యింది కాని సాయమైతే పేద తల్లులకు చేరలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో పేద విద్యార్థి తల్లి ఖాతాకు తేదీ చెప్పి మరీ సాయం అందించారు.

పలివెల సుధాకర్,
ఏడిద, మండపేట మండలం

కూటమి ప్రభుత్వంలో అన్నీ సమస్యలే

కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇస్తానన్న తల్లికి వందనం ఆర్థిక సాయాన్ని ఇవ్వలేదు. ఇంజినీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో చెల్లించకుండా బకాయిలను కొనసాగిస్తుంది. పరీక్షల నిర్వహణలో కనీస సదుపాయాలు తీసుకొన్న పాపానపోలేదు. కపిలేశ్వరపురం మండలం ఇంటర్ విద్యార్థులు పరీక్ష రాసిన కొత్తూరు సెంటర్ కేంద్రం అధ్వానంగా ఉంది. పరీక్ష రాసిన విద్యార్థులు తీవ్ర అవస్థలకు లోనయ్యారు. పరీక్ష కేంద్రం నిర్వహించిన ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలమైంది. వందేళ్ల క్రితం కట్టిన భవనం కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఫ్లోరింగ్ నెరలు తీయడంతో పాటు సీలింగ్ పాడైంది. ఆ విషయం తెలిసి కూడా కూటమి ప్రభుత్వం పరీక్ష కేంద్రంగా ఆలమూరు కళాశాలను ఏర్పాటు చేసింది. మన మిత్ర యాప్‌తో పాటు వాట్సాప్ నంబర్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని హడావిడి చేసినప్పటికీ ఆచరణలో హాల్‌టికెట్లు డౌన్లోడ్ అయ్యింది లేదు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం సాయం బకాయి పడింది. సుమారుగా మండపేట నియోజకవర్గంలో 21,441 మంది, రామచంద్రపురం 13,690 మంది మొత్తం 35,131 మందికి రూ.52,69,65,000 తల్లికి వందనం సాయం అందించాల్సి ఉంది.

క్లుప్తంగా

యూ విన్ వ్యాక్సినేషన్‌పై శిక్షణ



యూ విన్ వ్యాక్సినేషన్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పీహెచ్‌సీ వద్ద ఏఎన్‌ఎంలకు సోమవారం యూ విన్ వ్యాక్సినేషన్‌పై శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ గర్భిణులకు, అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు నుంచి ఐదు సంవత్సరాల వరకు వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు నిర్ణయించిన కాలంలో తప్పకుండా వేయాలన్నారు. వాటి వివరాలను యూ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. డాక్టర్ ఎస్. ప్రశాంతి మాట్లాడుతూ యూ విన్ పోర్టల్‌లో వ్యాక్సినేషన్ వివరాలు నమోదు చేయడం వల్ల వ్యాక్సిన్ సర్టిఫికెట్ పొందవచ్చని కొత్తగా వ్యాక్సిన్ సైట్ ఎలా క్రియేట్ చేయాలి, డ్యూలిస్ట్ ఎలా క్లియర్ చేయాలని తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. డీపీఎంఓ వెంకటేశ్వరరావు, సీహెచ్ఓ వీరమణి, సూపర్‌వైజర్లు సూర్యారావు, శ్రీనివాస్, రత్నం జానకమ్మ, వరలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

8 నుంచి పాపవినాసేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీదుర్గామాతా సమేత పార్వతీ పాపవినాసేశ్వరస్వామి, పార్వతీ సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి దివ్య కల్యాణ ఉత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఆలయ అర్చకుడు కాలధరి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో 8న కల్యాణం, 9న విశేషార్చన, 10న సదస్య మహోత్సవం, 11న నిత్య హోమం, 12న గ్రామోత్సవం, 13న శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నట్టు వివరించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



కపిలేశ్వరపురం చెరువులో పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సాకా

కపిలేశ్వరపురం: స్థానిక రావులచెరువులో పూడిక తొలగింపు పనులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో చేపట్టేందుకు అనుమతి లభించింది. కాగా పనులను సోమవారం సర్పంచ్ సాకా శ్రీనివాస్, నీటిసంఘం అధ్యక్షులు కొరపాటి రాంబాబు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు ప్రారంభించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు నామాల బుజ్జి, ఉపాధి మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



మండపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పారిశ్రామిక వేత్త వల్లూరి సాయికుమార్ బాబు చేతులు మీదుగా ప్రారంభించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు కార్యదర్శి బొబ్బా రామకృష్ణ మాట్లాడుతూ వేసవి వేడు గాలులు ఉన్నన్న రోజులూ చలివేంద్రాలను కొనసాగిస్తామని తెలిపారు.

నారాయణరెడ్డి సేవలు ప్రశంసనీయం



నారాయణరెడ్డికి నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు

కపిలేశ్వరపురం (మండపేట): న్యాయవాదిగా కేఆర్‌సీ నారాయణరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. మండపేటలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆలమూరు కోర్టు న్యాయవాదులు పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి సామాన్యుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వీవీవీ సత్యనారాయణ, సలాది సత్యనారాయణమూర్తి, కె.సునీల్, ఆదిమూలం అబ్బులు నాయుడు, బొబ్బా శ్రీనివాస్, ధూళి జయరాజు, జి.రాజశేఖర్, విజయ్‌కుమార్, సర్రాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు విడతలుగా ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని గ్రామాల్లో రెండు విడతలుగా ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి సోమవారం తెలిపారు. ఆరు సంవత్సరాలు లోపు చిన్నారులకు బాలాధార్ నమోదు, 5 –15 వయస్సుగల బాల బాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను శిబిరాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ నవీకరణ చేస్తారన్నారు. మంగళవారం అద్దంకివారిలంక, కోరుమిల్లి –1, కాలేరు గ్రామ సచివాలయాల్లో నవీకరణ చేస్తారన్నారు. 7న కేదారిలంక, మాచర, కాలేరు, 8న నల్లూరు, మాచర, కేదారిలంక, 12, 13 తేదీల్లో తాతపూడి, టేకి–2, వెదురుమూడి, 14, 15 తేదీల్లో కపిలేశ్వరపురం–2, అంగర–2, నేలటూరు గ్రామ సచివాలయాల్లో నవీకరణ చేస్తారన్నారు. ఆయా కేంద్రాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్ర సేవలు అందిస్తామని ఎంపీడీఓ వివరించారు.

మండపేటలో ఆధార్ సేవలు

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాల మేరకు మండపేట తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల 3వ సచివాలయం, సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలోని చిన్నారుల ఆధార్‌లను డిజిటల్ అసిస్టెంట్లు నవీకరించారు. ఈ నెల 8 వరకూ శిబిరాల్లో సేవలందిస్తారని కమిషనర్ రంగారావు తెలిపారు.

ద్రాక్షారామలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురం: కోనసీమ జిల్లా ప్రజలకు అనువుగా ఉండేందుకు రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో రూ.11.5 కోట్లతో 4 ఎకరాల స్థలంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ)ల ఏర్పాటుకు ఊతమిస్తూ కూటమి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. ద్రాక్షారామ సమీపంలోని ఆదివారంపేటలో గురుకుల పాఠశాల వద్ద ఈ పార్కు నిర్మాణం చేస్తామన్నారు. తన నియోజకవర్గ పరిధిలో 40 సంవత్సరాలు లోపు, భర్తలను కోల్పోయిన వితంతువులు 160 మంది వరకూ ఉన్నారని, తొలి ప్రాధాన్యతలో వారికి అవకాశం ఇస్తామని ప్రకటించారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాల కల్పన చేసి, పరిశ్రమల ఏర్పాటు సుగమం చేస్తామన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



విజయవాడలో కమిషనర్ సౌరబ్‌గౌర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కామన



మద్దతు ధర కల్పించాలని కోరుతూ కె.గంగవరంలో ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ సభ్యులు

కపిలేశ్వరపురం (మండపేట): ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ కొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందని స్థితిలో రైతులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలును ప్రభుత్వం క్లిష్టతరం చేయడం సరికాదన్నారు.

రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలి

కె.గంగవరం: రైతుల వద్ద నుంచి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో సోమవారం ఏఐకేఎంఎస్, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రబీలో రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.1725కి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ప్రభుత్వం నేరుగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులకు, మిల్లర్లకి మంచి అవకాశం దొరికిందని, తప్పుడు తూకాలతో రూ.300 నుంచి రూ.250 వరకు ధరలో కోత పెట్టి రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. దీని వల్ల ప్రతి రైతు ఎకరానికి రూ.12 వేలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ స్వయానా మంత్రి నియోజకవర్గంలో రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం ఇప్పటి వరకు గింజ కూడా సేకరించడం లేదని విమర్శించారు. ఏఐకేఎంఎల్ జిల్లా నాయకులు భీమశంకరం మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా రైతుల పంట తడిచిపోయిందని ప్రభుత్వం వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మృత్యుంజరావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించి ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఐఎఫ్టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, రైతులు వట్టికూటి జానకిరామయ్య, నేమాని సాయి, గరికిపాటి రామకృష్ణ, రావి బాబు, కాశి లెనిల్ బాబు, రామన్న తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



అంగరలో రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్యారోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో సోమవారం అంగర పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య కార్యకర్తలు రక్త నమూనాలను సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వైద్యాధికారిణి డాక్టర్ పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా గ్రామాల్లో 40 సంవత్సరాల వయస్సు గల 45 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. వారందరికీ సికిల్ సెల్ వ్యాధి లేనట్టు నిర్ధారణ అయ్యిందని డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా లేదా కొడవలి కణ రక్తహీనత అనేది వంశానుగత రక్త రుగ్మత అన్నారు. వ్యాధి సోకిన వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండకపోయినప్పటికీ వివాహం చేసుకున్న దంపతుల ఇద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీ మణి, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.అలీ, ఏఎన్‌ఎంలు శిరోమణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్డుల నమోదు



వెదురుపాకలో ఈ–శ్రమ్ కార్డుల నమోదు చేస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

రాయవరం: మండలంలోని వెదురుపాకలో సోమవారం ఈ–శ్రమ్ కార్డులు నమోదు చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సుధ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ–శ్రమ్ కార్డు పొందడం వలన అసంఘటిత కార్మికులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సిబ్బంది సుప్రియ, వీరబాబులు కార్మికులకు ఈ–శ్రమ్ కార్డుల నమోదు చేపట్టారు. గ్రామానికి చెందిన 150 మంది ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ వర్కర్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కె.శ్రీదేవి, స్థానిక నేతలు కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చిన కృష్ణంరాజు, సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు సరికొత్త అన్వేషణలు చేయాలి



కొత్తపేటలో సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న బసవరాజు తదితరులు

కొత్తపేట: విద్యార్థి దశ నుంచీ ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు శాస్త్రపరంగా అభివృద్ధి పరచుకుని సరికొత్త అన్వేషణలు చేయాలని విద్యావేత్త, సైన్స్ రచయిత డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ ఉద్బోధించారు. స్థానిక రిటైర్డ్ సైన్స్ ఉపాధ్యాయుడు పీవీబీఎన్ బసవరాజు స్వగృహం (సైన్స్ హోమ్)లో 8, 9, 10 తరగతుల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు సైద్ధాంతిక, ప్రాయోగిక భౌతిక శాస్త్రం వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం డాక్టర్ సర్వేశ్వరశర్మను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి, ఆయనతో సైన్స్ అంశాలను బోధించారు. శర్మ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో అగ్రస్థానంలో ఉన్న దేశాలలో భారతదేశం ఒకటన్నారు. ఐటీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ వంటి రంగాల్లో భారత్ పురోగమన దిశలో ఉందన్నారు. సైన్స్ ఇన్నోవేటర్ బసవరాజు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచీ భౌతిక శాస్త్ర ప్రయోగాలు చేయడం వలన ఆ శాస్త్ర భావనలు సులువుగా మనసులో నాటుకుంటాయన్నారు. అంతే కాకుండా ఆలోచనలను వస్తురూపంలోకి మలచే చాతుర్యత పెరుగుతుందన్నారు. శర్మను బసవరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రియదర్శినీ బాలవిహార్, సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్స్ అద్దంకి బుద్ధచంద్రదేవ్, ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయండి

మామిడికుదురు: ప్రతి రైతు విధిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని అనంతరపురం మోడల్ మేకర్ ట్రైనీ ఓబులేసు సూచించారు. ఆయన మామిడికుదురులో ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల విక్రయం స్టాల్‌ను సోమవారం పరిశీలించారు. ఓబులేసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడవన్నారు. ఈ ఉత్పత్తులను వినియోగించడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని చెప్పారు. ఇప్పటికే చాలా మంది ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులనే వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీటి సాగు మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. స్థానికులు ఈలి శ్రీనివాస్, వర్ధినేని వెంకట్రామయ్య, సాపే ఏకాదశి పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుసుమ పద్మావతి, జి.లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులు సద్వినియోగం చేసుకోవాలి



దేగలపేటలో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్న రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు

కాజులూరు: రాష్ట్రంలో కౌలు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందజేస్తున్న సీసీఆర్‌సీ కార్డులను ప్రతి కౌలు రైతు సద్వినియోగం చేసుకోవాలని శలపాక వీఆర్వో జి.గనికమ్మ అన్నారు. సోమవారం శలపాక, తణుకువాడ, దేగలపేట తదితర గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి సీసీఆర్‌సీ కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. దేగలపేటలో ఆమె మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుల కోసం వెబ్‌సైట్ ఓపెన్ అయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల చట్టం–2019 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పంటల సాగుదారుల హక్కుపత్రంతో భూ యజమానులకు ఎటువంటి నష్టం కలుగదని కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు 1బి, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌లింకు ఉన్న ఫోన్ నంబరుతో రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ అనూష, కౌలురైతులు పాల్గొన్నారు.

నష్టనివారణపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: భారీ వర్షాలకు నష్టపోయిన వరి పంటను సంరక్షించుకోవడంలో రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో సోమవారం వ్యవసాయధికారులు పర్యటించి వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో అధిక శాతం పంట పొలాలకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పంట గింజ మొలకలు రాకుండా ఉండేందుకు లీటర్ల నీటికి 50 గ్రాముల ఉప్పును కలుపుకుని పంటపై పిచికారీ చేయాలన్నారు. పొలాల్లోని ముంపు నీరు బయటకు పోయేందుకు చిన్నచిన్న బోదెలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఇప్పటికే మాసూళ్లు నిర్వహించి ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని సాధ్యమైనంత వరకూ రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపరచుకోవాలన్నారు. వీలుకాని పక్షంలో ధాన్యాన్ని కళ్లాల్లో రాశులుగా పోసుకుని గడ్డి, బరకాలు కప్పుకోవాలన్నారు. వీఏఏలు రమ్య, శిరీష, అనుష పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్



నిందితుడు సురేష్‌బాబును అరెస్ట్ చేసిన రాయవరం పోలీసులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో భార్యపై దాడి చేసిన భర్తను అరెస్ట్ చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దూలం సూర్యకుమారిపై భర్త శ్రీను ఆదివారం కత్తితో దాడి చేసిన విషయం పాఠకులకు విదితమే. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో కేసును దర్యాప్తు చేసి, నిందితుడు శ్రీనును అరెస్ట్ చేసి, అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరు పరిచారు. నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

12న వైశాఖ పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఈ నెల 12న వైశాఖ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పీఠంలోని విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవాని శంకర అష్టమలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

కపిలేశ్వరపురం (మండపేట): అంగరలోని వేణుగోపాల స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు స్వామిని కీర్తిస్తూ భక్తి గీతాలను ఆలపించారు. స్వామిని విశేషంగా అలంకరించారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంపు

కపిలేశ్వరపురం (మండపేట): రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సివిల్ సప్లయిస్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో కొనుగోలు పెంపుపై సంబంధిత మంత్రి నుంచి అంగీకారం వచ్చిందన్నారు. జిల్లాలో వరిసాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తాను కోరానన్నారు. దీంతో జిల్లాకు లక్ష టన్నుల ధాన్యం అదనపు కొనుగోలుకు మంత్రి అంగీకరించారన్నారు. రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో అమ్ముకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.